క్లుప్తంగా

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భామిని: భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌లకు సంబంధించి ఇంగ్లిష్ మీడియంలో చేరవచ్చన్నారు. ఈ ఏడాది మే 22లోగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివి పరీక్షలను రాసిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. వివరాలకు 9440322964 నంబరుకు సంప్రదించాలని కోరారు.

గాయత్రీదేవికి కుంకుమ పూజలు


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండలంలోని వండువ షిర్డీసాయి ధ్యాన మందిరంలో జరుగుతున్న మహాయజ్ఞంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీగాయత్రీదేవి సహిత పరిపూర్ణ దత్తసాయి మహాయాగంలో తాను భాగస్వామిని కావడం మానసిక ప్రశాంతత చేకూరిందన్నారు. ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహాయాగం ఈ నెల 24వ తేదీ వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

పోషక లోపాలు అధిగమించాలి

పాలకొండ రూరల్: సీజనల్ పంట మామిడి తోటల్లో పోషక లోపాలు అధిగమించేందుకు నీటి తడులు అందించేందుకు అవసరమైన చర్యలపై రైతులు దృష్టి పెట్టాలని ఉద్యానవన అధికారిణి అమరేశ్వరి అన్నారు. మండలంలోని బద్దుమాసంగి, ఎం.సింగుపురం తదితర గ్రామాల రైతులకు అవగాహన కార్యక్రమాలు శుక్రవారం చేపట్టారు. ఈ సమయంలో మామిడి మొక్క వయసుకు అనుగుణంగా యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అధికారుల సూచనలతో అందించాలన్నారు. దీని వల్ల మొక్కలకు బలం చేకూరుతుందన్నారు.

నేడు వినియోగదారుల సదస్సు

గరుగుబిల్లి: అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వినియోగదారుల సదస్సును నిర్వహించనున్నట్లు వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు పి.సూర్యారావు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ సదస్సులో వైద్య ఆరోగ్య శాఖ అధికారితో పాటు జిల్లా తూనికలు, కొలతల శాఖాధికారులు, జిల్లా శానిటరీ అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశంలో వినియోగదారులు పాల్గొనాలని కోరారు. ఆయనతో పాటు సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, సభ్యులు పి.ఈశ్వరరావు, ఎస్.మధుసూదనరావు, శ్రీనివాసరావు, సన్యాసినాయుడు, తవిటిరాజు తదితరులున్నారు.

నేటి నుంచి ఒంటి పూట బడులు

పాలకొండ రూరల్: వేసవి నేపథ్యంలో సోమవారం నుంచి పాఠశాలలకు ఒంటిపూట బడులు ప్రారంభమవుతున్నట్లు మండల విద్యాశాఖాధికారి కె.సోంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు శనివారం నుంచి ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ బడులు నిర్వహించాలన్నారు. వేసవి నేపథ్యంలో బడికి వచ్చే పిల్లల ఆరోగ్య రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన అన్ని బడులు నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు.

పాలన అస్తవ్యస్తం



వీరఘట్టం మేజరు పంచాయతీ కార్యాలయం

- వీరఘట్టం మేజరు పంచాయతీలో..
- 20 రోజులు సెలవు పెట్టిన పంచాయతీ ఈఓ
- తనకేమీ తెలియదంటున్న ఈఓపీఆర్‌డీ
- కార్యాలయంలో కొరవడిన పర్యవేక్షణ

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీలో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఓ గిరిజన మహిళ సర్పంచ్ కావడంతో ఆమెను వంటింటికి పరిమితం చేసి ఓ వ్యక్తి షాడో పాలన చేపడుతున్నాడు. మేజరు పంచాయతీ ఈఓగా పని చేస్తున్న ఎం.రవి తన ఆరోగ్యం బాగోలేదని 20 రోజులు సెలవు పెట్టారు. ప్రస్తుత ఈఓ సెలవులో ఉండడంతో ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికీ అప్పగించకపోవడంతో వీరఘట్టం మేజరు పంచాయతీలో ప్రస్తుతం పాలన గాడి తప్పింది. ఈఓ సెలవులో ఉంటే పాలనా పరమైన విషయాలను పర్యవేక్షించాల్సిన ఈఓపీఆర్‌డీ కూడా ఎక్కడున్నారో తెలియడం లేదు. దీంతో వీరఘట్టం మేజరు పంచాయతీలో పారిశుధ్య పరిరక్షణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా మారాయి. ఇటీవల ప్రధాన రహదారిలో నివాసం ఉంటున్న వారి నుంచి డబ్బులు వసూళ్లు చేసి పారిశుధ్య పనులు చేపట్టడంపై మేజరు పంచాయతీ తీరుపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇటువంటి అవినీతి పనులు జరుగుతున్నా పంచాయతీ పాలక వర్గం కనీసం ప్రశ్నించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈఓ సెలవు పెట్టడంతో ప్రధాన రహదారిలో చేపడుతున్న పారిశుధ్య పనులు మధ్యలోనే ఆగిపోయాయి.

ఇదీ పరిస్థితి

వీరఘట్టం మేజరు పంచాయతీలో 16 వార్డుల్లో సుమారు 17 వేల మందికి పైగా జనాభా ఉన్నారు. ఈ వార్డుల్లోని చాలా వీధుల్లో ప్రతీ రోజు పారిశుధ్య పనులు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాక చాలా వీధుల్లో ఉన్న కుళాయి పాయింట్లు వద్ద ట్యాపులు విరిగిపోవడంతో ప్రతీ రోజు వేల క్యూసెక్కుల తాగునీరు వృథాగా మురుగు కాల్వల్లో కలిసిపోతోంది. అలాగే చాలా చోట్ల వీధి లైట్లు వెలగడం లేదు. మరికొన్ని చోట్ల రాత్రింబవళ్లు వీధి లైట్లు వెలుగుతునే ఉన్నాయి. ఇలా అనేక సమస్యలు మేజరు పంచాయతీ ప్రజలను చుట్టుముట్టాయి. వీటిని పరిష్కరించాల్సిన పంచాయతీ ఈఓ కొన్ని రోజులుగా పత్తా లేకుండా పోయారు. గురువారం నాటికి ఈఓ 20 రోజులు సెలవు పెట్టారని కార్యాలయ సిబ్బంది పేర్కొంటున్నారు. ఈఓ సెలవు పెడితే గ్రామంలో ఉన్న సమస్యలు ఎవరు పరిష్కరిస్తారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

> **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా..**
>
> వీరఘట్టం మేజరు పంచాయతీలో ఈఓ లేకపోవడంతో చాలా పనులు పడకేసాయనే విషయం చాలా మంది తన దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటాను.
>
> – బి.వెంకటరమణ, ఎంపీడీఓ, వీరఘట్టం

కార్యాలయంలో పడకేసిన పనులు

పంచాయతీ కార్యాలయంలో ఏ పని చేయాలన్నా ఈఓ థంబ్ ఉండాలి. అలాగే ఈఓ డిజిటల్ కీ ఉండాలి. ప్రస్తుతం ఈఓ అందుబాటులో లేకపోవడంతో జనన, మరణాల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. సాల్వెన్సీ కోసం కూడా ప్రజలు నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇతర ఉద్యోగుల జీతాల బిల్లులు కూడా నిలిచిపోయాయి. అలాగే పంచాయతీలో సుమారు రూ.70 లక్షల జనరల్ ఫండ్ నిధులున్నా వాటిని అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించకపోవడంతో పంచాయతీలో పాలన పడకేసింది. ఈ పంచాయతీ పరిధిలో నాలుగు సచివాలయాలు ఉన్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు ఇటువైపు చూడకపోవడంతో వీరఘట్టం మేజరు పంచాయతీ నేడు అస్తవ్యస్తంగా మారింది. ఈ విషయంపై ఈఓ రవిని సాక్షి ఫోన్‌లో సంప్రదించగా తన ఆరోగ్య పరిస్థితి బాగోలేనందున విధులకు హాజరు కాలేకపోతున్నానని, 20 రోజులు సెలవు పెట్టినట్లు తెలిపారు.

టెన్త్‌లో సత్ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ అప్పలనాయుడు

గరుగుబిల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతీ విద్యార్థి మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ దత్తి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రావివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు అట్టలు, పెన్నులను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించాలన్నారు. ఇందుకు అవసరమైన కార్యాచరణను ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించాలన్నారు. పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగింది. హెచ్ఎం శొంబర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు సినిమా పాటలకు వేసిన నృత్యాలు అలరించాయి. టెన్త్ పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

వైభవంగా వరద గణపతి పూర్ణకలశ ప్రతిష్ట


చెముడులో ప్రతిష్ఠించిన లక్ష్మీ సరస్వతి సహిత వరద గణపతి దేవాలయం

మక్కువ: మండలంలోని చెముడు గ్రామంలో లక్ష్మీ సరస్వతి సహిత వరద గణపతి దేవాలయం పూర్ణకలశ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, యాగశాల, నవగ్రహపూజ, ఆలయ పూర్ణకలశ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దల సమక్షంలో దేవతామూర్తుల విగ్రహాలను అన్ని పురవీధుల్లో ఊరేగించి కార్యక్రమం నిర్వహించగా, మహిళలు కలశాలతో తిరువీధిలో పాల్గొన్నారు. అలాగే మహిళలు నిర్వహించిన కోలాటం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


మాట్లాడుతున్న హెచ్ఎం ఎం.శంకరరావు

సీతానగరం: మండలంలోని గాదెలవలస ఉన్నత పాఠశాల విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మంచిమార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ ఎంపీపీ బి.రామలక్ష్మి, స్థానిక సర్పంచ్ బొన్నాడ అన్నపూర్ణ అన్నారు. ఈ మేరకు మండలంలోని గాదెలవలస ఉన్నత పాఠశాలలో పదోతరగతి అభ్యసించి త్వరలో పబ్లిక్ పరీక్షలు రాయనున్న వారికి మిగతా విద్యార్థులు హెచ్ఎం ఎం.శంకరరావు ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థుల నుద్దేశించి ఆమె మాట్లాడుతూ త్వరలో టెన్త్ పబ్లిక్‌పరీక్షలు రాయనున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులై ఉన్నత చదువులు అభ్యసించిన పాఠశాలకు కీర్తిప్రతిష్ఠలు తేవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులంతా సమాజానికి ఉపయోగపడే విద్యాధికులు కావాలని ఆకాంక్షించారు. సీనియర్(టెన్త్) విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు సభనిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల రక్షణకు శక్తి టీమ్‌లు

పార్వతీపురం రూరల్: ఐదుగురు సభ్యులతో మూడుబృందాలుగా పార్వతీపురం మన్యం జిల్లాలో 15మందితో శక్తి టీమ్స్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు, చిన్నారులకు రక్షణగా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకంగా జిల్లాలో శక్తి టీమ్స్‌ను నియమించామని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్‌తో జిల్లా పోలీసు కార్యాలయంలో వారు నిర్వహించాల్సిన విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లాలో శక్తి టీమ్స్ కోసం ప్రత్యేకంగా కేటాయించిన ఫోర్‌వీలర్స్‌ను, పెట్రోలింగ్ వాహనాలను ప్రారంభించారు.

● రైతులకు శిక్షణ



వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని డొంబంగివలస గ్రామంలో రైతులకు శుక్రవారం వాతావరణ మార్పులు – విపత్తుల ప్రమాదాలపై శిక్షణ ఇచ్చారు. వాతావరణం అంటే ఏమిటి, గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ ప్రభావాలు, గొలుసు ఫలితాలు చిత్రపటాల ద్వారా వివరించారు. కమ్యూనిటీ ప్రమాదాలను గుర్తించడం, గ్రూపులుగా తయారు చేసి వివరించారు. ప్రస్తుత అధిక ఉష్ణోగ్రతలు గూర్చి వివరించారు. కార్యక్రమంలో పీవీ ఈత మానుగూడ పంచాయతీ పరిధిలో సలబం పాడు, నెలగండి, డొంబంగి వలస గ్రామాల నుంచి 41 మంది రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెలుగు ప్రతినిధులు రామయ్య, ఎం.కామేష్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

● ఆధ్యాత్మికతను చాటి చెప్పేందుకే..



భక్తులకు, ప్రజలకు భక్తి భావాన్ని చాటిచెప్పేందుకే భజనలు, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు భజన సేవా మండలి సభ్యులు జి.చినతిరుపతిరావు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్, విజయనగరం కన్వీనర్ జె.శ్యామ్‌సుందరరావు ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని మార్కొండపుట్టి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మనుషులలో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సన్మార్గంలో నడిపించేందుకు కుల, మతాలకు అతీతంగా భజనలు కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని భజన మండలి సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని భజనలు చేశారు. –గరుగుబిల్లి

● నవోదయంపై విస్తృత ప్రచారం


సారా వలన కలిగే నష్టాలు తెలియజేస్తున్న అధికారులు

జియ్యమ్మవలస రూరల్: సారా తయారీ, అమ్మకం, రవాణా చేయొద్దని ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నవోదయం 2.0 పై శుక్రవారం మండలంలోని గజపతినగరం ఎక్సైజ్ ఎస్ఐ పి.నరేంద్ర ఆధ్వర్యంలో చినబుడ్డిడి, అర్నాడ, గడ సింగపురం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. బొబ్బిలి ఎస్ఐ ఎ.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో కుందరుతిరువాడ, పెదతంబలి సిఖబడి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. సారా వలన కలిగే నష్టాలు తెలియజేశారు. కార్యక్రమంలో జియ్యమ్మవలస, కురుపాం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సారాతో జీవితాలు పాడు చేసుకోవద్దు..


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శేఖర్‌బాబు తదితరులు

కొమరాడ: సారాతో జీవితాలు పాడు చేసుకోవద్దని ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సీఐ శేఖర్‌బాబు అన్నారు. మండలంలోని ఆర్తాం, శివిని తదితర గ్రామాల్లో నవోదయ 2.0 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం జిల్లాలో సారా రహిత గ్రామాలు తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంఘాల ద్వారా సమస్యల పరిష్కారం


సభ్యత్వాలను నమోదు చేస్తున్న నాయకులు

పాలకొండ: రైతు సంఘాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో రైతు సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించడంతో ఫలితాలు సాదించామని తెలిపారు. రైతులు సంఘంలో చేరి తమ పోరాటాలకు కలసి రావాలని పిలుపునిచ్చారు. పలువురు రైతులకు సభ్యత్వాలను అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కిమిడి రాముర్తి, పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి


పశువులకు టీకాలు వేయిస్తున్న పశు సంవర్ధక శాఖ జేడీ మన్మధరావు

పాలకొండ రూరల్: వేసవిలో ఎండల తీవ్రతను తట్టుకునేలా పశు పెంపకంలో అవసరమైన జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్ధక శాఖ జేడీ శివ్వాల మన్మధరావు సూచించారు. మండలంలోని తుమరాడ, మంగళాపురం, వెలగవాడతో పాటు వడమ ప్రాంతాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. అక్కడ పాడి రైతులతో మమేకమై వారి సందేహాలను నివృత్తి చేశారు. రైతులకు పలు సూచనలు చేశారు. దాణా విషయంలో మెలకువలు పాటించాలని, నీటి నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధి అయిన గాలికుంటు తదితర రోగాలు సోకకుండా టీకాలు వేయించాలని సూచించారు.

● సంబరంగా రంగుల హోలీ


భామిని: లివిరిలో సాంప్రదాయ కామదహన మంటల వద్ద భక్తులు


పాలకొండ: రంగులతో సందడి చేస్తున్న యువతులు


వీరఘట్టం: హోలీ సందర్భంగా రంగులు చల్లుకున్న యువత


భామిని: నేరడిలో చిన్నారుల సందడి

రంగుల హోలీ ప్రతి చోట సంబరంగా శుక్రవారం జరిపారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అంతా ఆనందంగా రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మిఠాయిలు తినిపించుకున్నారు. అందరి జీవితాల్లో ఆనందం నిండాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్

ఘనంగా ఉమా భీమ లింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ


దేవతామూర్తులకు తిరువీధి చేస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో గ్రామస్థులు నిర్మించుకున్న రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం విఘ్నేశ్వరస్వామి పూజతో ప్రారంభమయ్యాయి. గ్రామస్థులంతా ఏకమై సమకూర్చుకున్న నిధులతో పాటు పలువురు ఇచ్చిన విరాళాలతో గ్రామంలోని కాలనీలో భీమలింగేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మాణం చేశారు. లాంఛనంగా గురువారం ప్రారంభించి శుక్రవారం వేకువజామున దేవతామూర్తుల ప్రతిమలతోపాటు త్రిశూలాన్ని భక్తులు సమకూర్చిన కలశాలతో ఊరేగింపుగా మేళతాళాలతో ఆలయ అర్చకులు ఆలయానికి చేర్చారు. ఈ మేరకు శుక్రవారం ఉత్సవ కమిటీ పిలుపు మేరకు బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు స్వామివారిని దర్శించుకుని జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.